www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 6 మే 2024

8 పేజీలు

ఏలూరు

పశ్చిమ గోదావరి

ఇక్కడ పూర్తి.. అక్కడ ప్రారంభం..!

ఏలూరు జిల్లాలో ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

తొలిరోజు సమస్యలను పరిష్కరించిన అధికారులు

నేడు, రేపు 'పశ్చిమ'లో పోస్టల్ ఓటింగ్

రెండు రోజుల్లో ఓటు వేయలేని వారికి మరో అవకాశం

ఉంగుటూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఏలూరు జిల్లాలో పూర్తయ్యింది. సోమవారం నుంచి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రారంభం కానుంది. ఏలూరు జిల్లాలో తొలిరోజు శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. రెండోరోజు ఆదివారం ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేయడంతో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. రెండో రోజు ఆదివారం పెద్దఎత్తున ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు 30 వేల మందికిపైగా పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉన్నారు. ఆయా జిల్లా అధికారులు తమకున్న ఆదేశాల ప్రకారం పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాలో నాలుగు, ఐదు తేదీల్లో ఓటింగ్ ప్రక్రియ సాగింది. ఏలూరు జిల్లాలో పోస్టల్ ఓటు వినియోగించుకునే ఉద్యోగులు పని చేసే నియోజకవర్గంలోనే ఓటు వేయాలన్న నిబంధన కొనసాగగా, పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం ఓటు ఏ నియోజకవర్గంలో ఉంటే అక్కడే ఓటు వేయాలనే నిబంధన పెట్టారు. దీంతో జిల్లాకో నిబంధన విధించడంపై ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆరు, ఏడు తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లాలో పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లూ చేసినట్లు అక్కడి జిల్లా అధికారులు చెబుతున్నారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలని ఉద్యోగులు చెబుతున్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం కారణంగానే ఏలూరు జిల్లాలో తొలిరోజు ఇబ్బందులు ఏర్పడ్డాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. తమకు నిర్దేశించిన తేదీల్లో ఓటు వేయలేని పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులకు మరో అవకాశం సైతం ఎన్నికల కమిషన్ కల్పించింది. ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, తేదీల్లోనూ పోస్టల్ బ్యాలెట్‌ను సంబంధిత నియోజకవర్గ ఆర్ఓ కార్యాలయంలో వినియోగించుకునేలా అవకాశం రావడం ఉద్యోగులకు ఊరటనిచ్చింది.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లుపై పార్టీల లెక్కలు

ఏలూరు జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఎవరికి ఎంతశాతం ఓట్లు పడ్డాయనే లెక్కలు కడుతున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 18 వేలకుపైగా పోస్టల్ ఓట్లు ఉన్నాయి. రెండు రోజుల్లో పోలైన ఓట్లలో టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు పడ్డాయో ఆయా పార్టీల నాయకులు బేరీజు వేసుకుంటున్నారు. వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు సైతం పోస్టల్ ఓట్లకు రూ.1500 వరకూ పంపిణీ చేసిన పరిస్థితి ఉంది. వైసిపి ప్రభుత్వంపై ఉద్యోగులు వ్యతిరేకంగా ఉన్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవ్వడంతో ఓటింగ్ ప్రక్రియపై ఆసక్తి నెలకొంది. ఒక్కో నియోజకవర్గంలో తక్కువగా లెక్కించినా రెండువేలకు పైగా పోస్టల్ ..6లో



రోడ్డుషోలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతోపాటు సిపిఎం, కాంగ్రెస్ నేతలు

ఇండియా వేదికతోనే అభివృద్ధి

కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

ఏలూరు రోడ్‌షోలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి – ఏలూరుఅర్బన్

ఇండియా వేదికతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, జిల్లాలోని కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు నగరంలో ఇండియా వేదిక తరపున సిపిఐ ఏలూరు ఎంఎల్ఏ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యలను గెలిపించాలని కోరుతూ రోడ్‌షో నిర్వహించారు. స్థానిక పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమైన రోడ్డుషో ఆర్ఆర్‌పేట, వెంకటేశ్వరస్వామి గుడి సెంటర్, జివి మాల్ ..6లో

అధికారంలోకి రాగానే రూ.20 లక్షల ఉద్యోగాలు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

మాట్లాడుతున్న లోకేష్, హాజరైన జనం

వార్త మెయిన్‌లో..

ప్రశాంతంగా నీట్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యుజి పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రమైన ఏలూరులో ప్రశాంతంగా జరిగింది. ఏలూరులో సర్ సిఆర్‌రెడ్డి అటానమస్ కళాశాల, వట్లూరులోని సర్‌సిఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల, స(త్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షకు మొత్తం 1,361 మందికి 1,318 మంది విద్యార్థులు హాజరవ్వగా 43 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల 20 నిమిషాల వరకు పరీక్ష జరగ్గా ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించారు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు మాత్రమే అనుమతించగా కనీసం తాగునీటి సీసా కూడా అనుమతించలేదు. తాగునీరు పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఆయా కేంద్రాల గేటు వద్దే క్షుణ్ణంగా మెటల్ డిటెక్టర్‌లతో పరిశీలించి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా ..6లో

చెవి రింగులను తీయిస్తున్న సిబ్బంది

సమస్యల తీరం.. పోలవరం

మధ్యపేజీల్లో..

మార్క్ సిద్ధాంతం ప్రపంచానికే ఆదర్శం

7లో..

సావిత్రమ్మ సేవలు చిరస్మరీయణీయం

8లో..

నేటి నుంచి ఆరు రోజులు పోస్టల్ బ్యాలెట్

- 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఇవిఎంలు, సిబ్బంది తరలింపునకు 520 వాహనాలు సిద్ధం
- జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు
- 14 ఎఫ్ఐఆర్‌లు నమోదు, రూ.2.10 కోట్లు నగదు సీజ్
- అల్లర్లు, అలజడులు సృష్టించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి – భీమవరం

జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 6, 7 తేదీల్లో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్నామని, ఒకవేళ ఈ రెండు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేని ఉద్యోగులకు 8, 9, 10, 11 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటును ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందించే సౌకర్యాన్ని కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో ఆదివారం జిల్లా ఎస్పి అజిత వేజెండ్లతో కలిసి సుమిత్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లనూ ..6లో

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కోడ్ అమలులో అధికారులు విఫలం

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై 50 రోజులు దాటుతున్నప్పటికీ నిబంధనలు అమలు చేయడంలో ఏలూరు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా ప్రభుత్వ, పబ్లిక్ స్థలాల్లో ఎటువంటి ప్రచారాలకు అనుమతి లేదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెప్పినప్పటికీ నిబంధనలను అతిక్రమించి ఈనెల 1వ తేదీన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏలూరులో సిద్ధం సభ ఏర్పాటు చేసిన సందర్భంగా ఇష్టారాజంగా రోడ్లపై ప్లెక్సీలు ఏర్పాటు చేశారు.



రోడ్లపై ఇష్టారాజ్యంగా ఉన్న ప్లెక్సీలు

జిల్లా కోర్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్లెక్సీలు తొలగించినప్పటికీ ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ ప్లెక్సీ నేటికీ తొలగించలేదు. ప్రతిరోజు జిల్లా ఉన్నత అధికారులతో పాటు రిటర్నింగ్ ఆఫీసర్లు, ప్రత్యేక పరిశీలకులు తిరిగే ఫైర్ స్టేషన్ సెంటర్‌లో అంత భారీ హోర్డింగ్ కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పబ్లిక్ స్థలంలో ఏర్పాటుచేసిన ఆ ప్లెక్సీని తొలగించి, ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

కొయ్యలగూడెంలో అన్నసమారాధన

ప్రజాశక్తి – కొయ్యలగూడెం

ప్లానెట్ గ్రీన్ అధినేత, చిరుధాన్యాల సేంద్రియ వ్యవసాయ విధాన ప్రముఖులు నిడదవోలు వినయ్ రామ్ జన్మదినోత్సవ సందర్భంగా ఆదివారం వృద్ధాశ్రమాల్లో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కొయ్యలగూడెం–జంగారెడ్డిగూడెం రోడ్డులోని కల్పవృక్ష వృద్ధాశ్రమం, కన్నాపురం సమీపంలోని వృద్ధాశ్రమం, అదేవిధంగా పోలవరం రోడ్డులోని ఎంపిపి స్కూల్(మెయిన్) ఆవరణలో యాచకులకు, వికలాంగులకు అన్నసమారాధనలు చేశారు. అదేవిధంగా గిరిజన గ్రామాల్లోని చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అంతరించిపోతున్న చిరుధాన్యాల సేకరణతో పాటు వేలాది ఎకరాల్లో వాటిని సాగుబడి చేస్తూ రైతాంగానికి వినయ్ రామ్ వెన్నుదన్నుగా నిలిచారని వైసిపి ఆర్యవైశ్య సెల్ జిల్లా నాయకులు మాజేటి సత్యనారాయణ పేర్కొన్నారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వినయ్ రామ్ హైదరాబాద్‌లో స్థిరపడి స్థానికంగా ఉన్న


వృద్ధాశ్రమంలో ఆహారం అందిస్తున్న సభ్యులు

ఇరవైకి పైగా కుటుంబాల వారికి ఉపాధి మార్గం చూపించారని అన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమాలను రోటరీ క్లబ్ సభ్యులు ప్రారంభించారు. బుట్టాయిగూడెం మండలం కన్నారప్పాడు, ఉప్పరిల్ల గ్రామాల్లోని వంద మంది చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గాలం కోటేశ్వరరావు, దివాణం మురళీ, మధు, సుధీర్, శ్రీనివాస్, మధు కిరణ్ రవిచంద్ర, వంశీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వైసిపి గెలుపునకు కృషి చేయాలి

ఎంపీ గొల్ల బాబూరావు

ప్రజాశక్తి – కామవరపుకోట

వైసిపి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం కోసం అందరూ కృషి చేయాలని ఎంపీ గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని వీరిశెట్టి గూడెం గ్రామంలోని వైసిపి ఏలూరు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దాసి.సుందర్ పాల్(పండు) ఇంటికి రాజ్యసభ సభ్యులు, ఎంపీ గొల్ల బాబూరావు శనివారం రాత్రి విచ్చేశారు. ఆయన్ని శాలువాతో కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ వైసిపిలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడు అన్యాయం జరగదని, ఈ ప్రాంతంలో మిత్రులు, బంధువులు చాలా మంది ఉన్నారని ఆయన తెలిపారు. ఈ


బాబూరావును సన్మానిస్తున్న పాల్

కార్యక్రమంలో చంద్రమౌళి, వీరిశెట్టిగూడెం మత్స్యకార సొసైటీ ఛైర్మెన్ పెనుమాల సంజీవరావు, ఉప్పె జయరాజు, సూరం జయ, తీట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ప్రాంగణ ఎంపికలు

హాజరైన ప్రముఖ ఐటీ కంపెనీలు

ప్రజాశక్తి – పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో టాలెంటింగ్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ ఐటీ కంపెనీలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ప్రముఖ ఐటీ కంపెనీ హెక్సావేర్ హాజరైనవి. ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి 165 మంది అభ్యర్థులు హాజరైనారు. 32 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులలో 26 మంది ఛాంబర్స్ కళాశాల విద్యార్థులని, 6 గురు సిఎస్ఎన్ కళాశాల విద్యార్థులని తెలిపారు. వీరికి జీతం, ఇతర అలవెన్స్ కలిపి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ నెలకు అభ్యర్థులకు అందుతుందని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జగన్మోహన్ రెడ్డి ప్లేస్మెంట్స్ ఆఫీసర్, బిఒఎస్ ఛైర్మన్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాట్లాడుతూ ఛాంబర్స్

కాల్ లెటర్స్‌తో విద్యార్థులు

కళాశాలలో సంవత్సరంలోనే అనేకమార్లు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఎంపిక కావడం, ఇతర కళాశాల విద్యార్థులను ప్రోత్సహించడంలో ఛాంబర్స్ కళాశాల యాజమాన్యం ముందుంటారని చెప్పారు. ఇలాంటి కళాశాల ఈ ప్రాంతంలో ఉండడం చదువుకునే పేద విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని, ఇలాంటి కళాశాలలో విద్యను అభ్యసించడం ద్వారా మరింత ఉద్యోగ అవకాశాలకు విద్యార్థులను తీర్చిదిద్దుతుందని తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రొఫెసర్ జగన్మోహన్ రెడ్డి, కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, సెక్రటరీ కె.రామరాజు, టాలెంట్ సైన్ సంస్థ సిఇఒ వేణుగోపాల్, హెక్సావేర్ హెచ్ఆర్ లెనిన్ చేతుల మీదుగా కాల్ లెటర్స్ ఇవ్వడం జరిగింది.

2 వేల మందికి మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి – ముదినేపల్లి

కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఆదివారం ముదినేపల్లిలోని కైకలూరు రోడ్‌లో యువ నాయకులు శొంఠి కుమారస్వామి ఆధ్వర్యంలో డిఎన్ఆర్ చిన్న కోడలు దూలం స్వాతి చేతుల మీదుగా 2 వేల మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, కోమటి విష్ణువర్ధన్, సాక్షి సాయిబాబు, మద్రివాడ సుధాకర్ రెడ్డి, తాడంకి రాజేష్, బేతు రాజా, యడవల్లి పండు, కొత్త రాము, ఏసు, కొల్లి నాని, దివి సతీష్ పాల్గొన్నారు.

క్షత్రియుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి – పాలకొల్లు

సమాజ సేవలో క్షత్రియ సామాజిక వర్గం ఎప్పుడూ ముందుంటుందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణమండపంలో జరిగిన క్షత్రియుల సామాజికవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను కూడా 20 సంవత్సరాల క్రితం ధర్మారావు ఫౌండేషన్ స్థాపించి ఎందరో పేదలను ఆదుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ రాజుతో పాటు ఎంఎల్ఎను సంఘ పెద్దలు సత్కరించారు. ఇంకా సంఘ అధ్యక్షులు భూపతి రాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, కెవి.కృష్ణ వర్మ, కెవి రామకృష్ణ రాజు పాల్గొన్నారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి – కుక్కునూరు

కుక్కునూరు మండల కేంద్రంలో రామసింగారం మిల్లు కాలనీకి చెందిన వ్యక్తి వడదెబ్బ తగిలి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే దార రమేష్(45) కూలీ పని చేసుకొని జీవనం కొనసాగించే వాడు. ఉదయం 9 గంటలకి ఇంటి నుంచి బయటికి వెళ్లిన రమేష్ సాయంత్రం ఇంటికి సమీపంలో ఉన్న దిమ్మపై పడుకొని ఉండటం కుటుంబ సభ్యులు గమనించి వెళ్లి పలకరించగా స్పృహ కోల్పోయి ఉన్నాడు. స్థానిక 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి చూసి వడదెబ్బతో చనిపోయి ఉంటారని తెలిపారు.

మినీ లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలోని కొత్త బస్టాండ్ దగ్గర, అంబికా హోటల్ ఎదురుగా టివిఎస్ మోపెడ్ వాహనాన్ని మినీ లారీ ఢీకొనగా వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. జంగారెడ్డిగూడెం పేరంపేట లే అవుట్ కాలనీకి చెందిన బవిరిశెట్టి నాగరాజు(40) వృత్తిరీత్యా వంట మేస్త్రి, ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం జంగారెడ్డిగూడెం పని నిమిత్తం వచ్చి, పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఏలూరు రోడ్‌లోని అంబికా హోటల్ దగ్గరకు రాగానే అటుగా హై స్పీడ్‌తో వస్తున్న మినీ లారీ నాగరాజును గట్టిగా ఢీకొనగా నాగరాజుకు గాయాలైయ్యాయి. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. నాగరాజుకి కాలు విరిగినట్లుగా వైద్యులు తెలియజేశారు. నాగరాజుని ఐసియూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మినీ లారీని స్టేషన్‌కు తరలించారు.

కాపర్ వైర్లు అపహరణ

కేసు నమోదు

ముసునూరు: రైతుల పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్లను దుండగులు దొంగిలించినట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత ఏప్రిల్ నెలలోని 29, 30వ తేదీల్లో మండలంలోని లోపూడి, గుళ్లపూడి గ్రామాల్లోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫారంలోని రాగి వైర్లను అపహరించినట్లు రైతులు ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతదేహం కోసం గాలిస్తున్న మత్స్యకారులు

గోదావరి స్నానానికి వెళ్లి వ్యక్తి గల్లంతు

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి – పోలవరం

బంధువుల ఇంటికి వచ్చి, సరదాగా గోదావరి స్నానానికి వెళ్లి వ్యక్తి గల్లంతైన సంఘటన ఆదివారం పోలవరం గ్రామంలోని స్థానిక ఆంజనేయస్వామి గుడి రేవులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ షేక్ అహ్మద్ భాషా (45) పోలవరం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చాడు. తన బంధువులు మరో ఏడుగురితో కలిసి గోదావరికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా గోదావరిలో లోతు ఎక్కువగా ఉండడం, గోదావరి ప్రవాహ వేగం ఎక్కువగా ఉండడం వల్ల గోదావరిలోకి కొట్టుకుపోయాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు నదిలో పడవలతో గాలింపు చర్యలు చేపట్టారు. షేక్ అహ్మద్ భాషా ఇంటర్, 7వ తరగతి చదువుతున్న ఒక పాప, బాబు ఉన్నారు. గోదావరి నది లోతు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గోదావరిలో స్నానాలకు ఉపక్రమించరాదని, గ్రామస్తులు తమ పిల్లలు, సెలవులకు ఇంటికి వచ్చిన బంధువులు గోదావరి స్నానాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు.

మృతి చెందిన కార్మికుడు

ప్రమాదవశాత్తూ భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి – పోలవరం

పాత ఇంటి గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవ శాత్తూ మృతి చెందిన సంఘటన పోలవరం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలవరం పంచాయతీ పాతపోలవరం గ్రామానికి చెందిన పోలవరపు వీరభద్రం(46) తన ఇంటికి సమీపంలో ఉన్న శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడలు పడగొడుతున్న సందర్భంలో ఇంటి గోడ మీదపడడంతో మృతి చెందాడు. మృతునికి డిగ్రీ, టెన్త్ చదువుతున్న ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

NADAKUDITI KARUNA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.21-04-2017న P9992044 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. ది.26-04-2024న నరసాపురం టౌన్‌లో మా బందువుల ఇంటికి వెళ్ళినపుడు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు నరసాపురం మెయిన్‌రోడ్‌కు వెళ్తున్నపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

NADAKUDITI KARUNA
W/o. Kadakutidi Murali Krishna
D.No. 1-37, Podu, Nidamarru Post
Kruthivennu Mandal, Krishna Dt., A.P.

'రాజ్యాంగాన్ని కాపాడాలంటే ఇండియా వేదికను గెలిపించాలి'

ప్రజాశక్తి - తణుకురూరల్

మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే ఇండియా వేదికను గెలిపించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ కోరారు. పట్టణంలోని వీరభద్రపురంలో కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కడలి రామారావుతో కలిసి ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, కడలి రామారావు మాట్లాడుతూ ఏ పార్టీ మేనిఫెస్టోలో కూడా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పలేదన్నారు. ఇండియా వేదిక ఒక్కటే ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు అమలు కావాలంటే ఇండియా వేదిక రావాలన్నారు. ఈ ప్రచారంలో సిపిఎం నాయకులు కామన మునిస్వామి, గార రంగారావు, గుబ్బల గోపీ, మల్లిపూడి లక్ష్మి, సిహెచ్.వరలక్ష్మి, పి.కాశి, డి.శాంతారావు, కడలి గోపీ, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సిపిఐ నేతల ప్రచారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని ఎర్రంపేట, కనకాద్రిపురం గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, పోలవరం ప్రాజెక్ట్ పూర్తవ్వాలన్నా, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలన్నా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి సృజనను గెలిపించాలని కోరారు.

వైసిపిని గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రం కొయ్యలగూడెంలో ఎంపిపి గంజిమాల రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బిసి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీవెలగల దుర్గారావు, పసిన సత్యనారాయణ వారి బృందం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, బిసి సెల్ జిల్లా నాయకులు కట్టా రాము, బిసి సెల్ మండల ప్రెసిడెంట్ మరిసెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిఎన్ఆర్ కోడలు ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపి కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు స్వాతి మండలంలోని కాకరవాడ పంచాయతీ శివారు దేవరం గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌యాదవ్‌ను, కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు.

'వైసిపితోనే సమగ్ర అభివృద్ధి'

పెనుమంట్ర :రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి చోటు ఇవ్వాలని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కోరారు. మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామంలో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు సిహెచ్.నరేష్ రాజు, ఎంపిపి కర్రి వాసురెడ్డి సతీమణి రాధ, గ్రామ సర్పంచి పనుము సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి సూర్య భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి వైసిపి కృషి

మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు

చర్చిలో మంత్రి కారుమూరి, అల్లుడు దిలీప్‌కుమార్

ప్రజాశక్తి - తణుకు రూరల్

క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి వైసిపి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో వేల్పూరు, గోటేరు, కంచుమర్రు, కొమ్మర, ఈడూరు స్కిన్నెరపురం, మంచిలి గ్రామాల్లో చర్చిలను ఆయన ఆదివారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ క్రైస్తవుల బరియల్ గ్రౌండ్స్ సమస్యలను వచ్చే వైసిపి ప్రభుత్వంలో పరిష్కరిస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సిఎం జగన్ చర్చి పాస్టర్లకు ప్రతి నెలా రూ.5వేలు గౌరవ వేతనం అందించారన్నారు. నియోజకవర్గంలో చర్చిల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందించానన్నారు. ఎన్నికల అనంతరం క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ



మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుగొండ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి ఆచంట నియోజకవర్గ అభిమాన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పితాని సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బ్రాహ్మణులను అణగతొక్కేందుకు వారికి రాయితీలు రాకుండా అడ్డుపడుతుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను టిడిపి అయంలో చంద్రబాబు మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ప్రవేశ పెట్టారన్నారు. బ్రాహ్మణులందరూ టిడిపి కూటమికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నక్క శ్యామల సోని శాస్త్రి, దేశిక రామ్మోహన్‌రావు, తోలేటి రాంబాబు, సిస్ట మణికంఠ, చిలుకూరి బుజ్జి, కాళ్లకూరి బుజ్జి, కాశీభట్ల నాగేశ్వరి, పి.భవాని, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే ప్రత్యేక హోదా

కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారామ్

ప్రచారంలో అంకెం సీతారామ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇండియా వేదికతోనే సాధ్యమని కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారామ్ అన్నారు. దుర్గాపురం 38, 39 వార్డుల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుటుంబసమేతంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో బిజెపి అరాచక పాలనకు స్వస్తి పలకాలన్నారు. ఇండియా వేదికతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ఇండియా వేదిక చేపట్టిన తొమ్మిది గ్యారెంటీలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, రాష్ట్ర కార్యదర్శి దుండి రవివర్మ, భీమవరం యూత్ పట్టణ అధ్యక్షులు బోనం రవికుమార్, మండల యూత్ అధ్యక్షులు మణికంఠ ముత్యం విజయకుమార్, పాకెర్ల బాబ్జి, కూరెళ్ల సాయి వెంకట రామరాజు, బురుడి వాసుదేవరావు, ముక్కోడి, వైకుంఠ రావు, డి.నాగు, కె.కృష్ణ, పతివాడ నాగరాజు, పి.సత్య నారాయణ, సిపిఎం, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇండియా వేదికతోనే ప్రజలకు మేలు'

ప్రజాశక్తి - తణుకు

ఇండియా వేదికతోనే ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కడలి రామారావు అన్నారు. స్థానిక అక్కమాంబ టెక్స్‌టైల్ వద్ద సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా వేదిక అధికారంలోకొస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రుణమాఫీ అమలు చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని టిడిపి నూజీవీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజీవీడు మండలం మర్రిబంధం, సీతారాంపురం గ్రామాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి కూటమి మేనిఫెస్టో చూసి జగన్మోహన్ రెడ్డి భయపడ్డాడన్నారు. ఇక్కడ మూడుసార్లు ఎంఎల్ఎగా గెలిచి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తానని చెప్పారు. నూజీవీడును కృష్ణా జిల్లాలో కలుపుతానని చెప్పారు.

'వైసిపి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి'

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరులో సర్పంచి బొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 200 మంది టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమాబాల మాట్లాడుతూ ఉండిలో ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే తిరిగే పివిఎల్‌ను గెలిపించాలని కోరారు. పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ తాను ఎంఎల్ఎ కాకపోయినా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అభివృద్ధి చేశానన్నారు.

పలు గ్రామాల్లో రఘురామ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజును గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి రమాదేవి మండలంలోని బొండాడ, బొండాడపేట గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రార్థన మందిరాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు.

దొంగలను తరిమికొడదాం : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో దొంగలు పడి ఐదేళ్లుగా ప్రజలను, రాష్ట్రంలో సంపదను దోచుకుంటున్నారని, వారిని తరిమి కొట్టాలని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 32, 9, 8 వార్డుల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి సంక్షేమం పేరుతో ప్రజలను, రాష్ట్రంలోని గనులన్నింటిని దోచేస్తుంటే, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణ అడుగడుగునా దోచేసి ప్రజలను హింసించారన్నారు.

నరసాపురంలో ముదునూరి సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నడూ లేని విధంగా పట్టణంలోని 14వ వార్డును అభివృద్ధి చేశామని వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సతీమణి శారదవాణి అన్నారు. 14 వార్డులో ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ఆమె ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 వార్డులో రూ.3 కోట్లు ఖర్చు చేసి బరియల్ గ్రౌండ్, మహా ప్రస్థానం, అధునాతన సదుపాయాలతో విశ్రాంతి భవనం, అస్థికలు భద్రపరిచే గది, వాచ్‌మెన్ క్వార్టర్ భవనాలతో అభివృద్ధి చేశామన్నారు. నాడు-నేడులో స్కూల్, డ్రెయినేజీ, రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

తాడేపల్లిగూడేన్ని అభివృద్ధిలో అగ్రగామిగా చేస్తా : కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మరో ఐదేళ్లలో తాడేపల్లిగూడేన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక కొండయ్య చెరువు వద్ద ఉంగరాల వారి వీధిలో పట్టణ రజక సేవా సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2004లో తాను తొలిసారి ఎంఎల్ఎగా ఎన్నికైనప్పుడు నియోజకవర్గాన్ని రూ.600 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. మళ్లీ రెండోసారి ఎంఎల్ఎగా ఎన్నికై 2019 నుంచి 2024 వరకు అనేక అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. రానున్న ఐదేళ్లలో రూ.1100 కోట్ల విలువైన పనులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

నేనెవ్వరికీ అమ్ముడుపోలేదు : శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

తాను ఎవ్వరికీ అమ్ముడు పోయే వ్యక్తిని కాదని, అటువంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడిన వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఫార్వర్డ్ బ్లాక్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని వాండ్రం గ్రామంలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అమ్ముడుపోయి ఉండి అసెంబ్లీ బరిలో నిలిచానని రఘురామకృష్ణంరాజు మాట్లాడటం బాధాకరమన్నారు. ఆయన వ్యాఖ్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

దళిత ద్రోహి జగన్‌ను ఓడించండి

దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దళితులను అన్ని విధాలుగా వంచించిన వైసిపిని రానున్న ఎన్నికల్లో గద్దె దించి, టిడిపి కూటమిని గెలిపించాలని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు అన్నారు. జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆయన ఆదివారం కలిసి మద్దతు ప్రకటించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా చెట్టే రాజు మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు నవరత్నాలు పేరుమీద దారి మళ్ళించి సిఎం జగన్ దళితులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఐదేళ్లలో విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాల్లో దళితుల అభివృద్ధిని 20 ఏళ్ల వెనక్కి నెట్టిన వైసిపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలపాల సురేష్, రాచర్ల సాగర్, కండెల్లి రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇవిఎం కమిషనింగ్

ఉంగుటూరు ఆర్‌ఒ ఖాజావలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం), బ్యాలెట్ యూనిట్ (బీయు), ఓటర్ వెరిఫికబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివి ప్యాట్)లో బ్యాలెట్ పత్రాలు అమరిక (కమిషనింగ్) ప్రక్రియ రెండు రోజుల నుంచి కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ జరుగుతోంది. నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూం, కమిషనింగ్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇప్పటివరకూ 180 ఇవిఎంల కమిషనింగ్ పూర్తయిందని మిగతావి సోమవారం నాటికి పూర్తి కానున్నాయని ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్‌కె.ఖాజావలీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషన్‌ను కమిషనింగ్ చేయడం అంటే వాటి భౌతిక స్థితి తనిఖీ, ఫంక్షనల్ టెస్టింగ్, సాఫ్ట్‌వేర్ ధృవీకరణ, మాక్‌పోల్, సీలింగ్, డాక్యు మెంటేషన్ తదితర ప్రక్రియను పూర్తిచేశాక అనధికార యాక్సెస్‌ల నుంచి ఇవిఎంలను రక్షించే విధంగా భద్రతా ప్రొటోకాలను అమలు చేయడంతో కమిషనింగ్ ప్రక్రియ పూర్తవుతుందని ఆర్‌డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఓటింగ్‌పై నమ్మకం సమగ్రతను కాపాడుకోవడం పాటు ఓటర్లు ఎన్నికల ఫలితాలను విశ్వసించగలరని, నిర్ధారించడంలో కమిషనింగ్ అనేది కీలకమైన దశ అని ఆర్ చెప్పారు. ఈ కమిషనింగ్ ప్రక్రియలో ఒక బియులో సాంకేతిక సమస్య రావడంతో రిజర్వుడ్‌లో బియును వినియోగించామన్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

దళితులను 50 ఏళ్లు వెనక్కి నెట్టిన జగన్

ఆత్మీయ సమ్మేళనంలో సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ఐదేళ్లలో దళితులను 50 ఏళ్లు వెనక్కి నెట్టిన వ్యక్తి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం వేములపల్లిలో దళిత ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఎస్‌సి సెల్, తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, ఎన్‌టి.రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మీయ సమ్మేళనంలో కామవరపుకోట మండలం కొండగూడెం గ్రామానికి చెందిన వైసిపి క్రిస్టియన్ డైరెక్టర్ పండు జగదీష్ ఆధ్వర్యంలో 150 మంది టిడిపిలో చేరారు. వారికి రోషన్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లలో ఒక్కసారి కూడా దళిత, ప్రజా సంఘాలను కలవని ఏకైక సిఎం జగన్ అని అన్నారు. దళిత మంత్రులను, ఎంపీలను, ఫైర్‌బ్రాండ్ కనీసం కలిసే అవకాశం కూడా ఇవ్వని వ్యక్తి జగన్ అని అన్నారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు అనే ఆయుధం ద్వారా మరి ముఖ్యంగా దళితులు జగన్‌కి దిమ్మ తిరిగే తీర్పు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, బటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అవినాష్, జీవరత్నం జెపాల్, పండు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్

ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్ అన్నారు. ఆదివారం ఏలూరు సర్ సిఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఎన్నికల మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన రెండో విడత శిక్షణా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ప్రత్యక్ష పాత్ర లేకున్నా నిఘా నేత్రాలతో పరిశీలిస్తూ తప్పిదాలు, ఉల్లంఘనలు సంభవిస్తే వెంటనే ఎన్నికల పరిశీలకుల దృష్టికి తేవాలన్నారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల పరిశీలకులకు మైక్రో అబ్జర్వర్లు కళ్ళు, చెవులు వంటి వారన్నారు. పోలింగ్ కేంద్రంలో పిఒ, ఏపిఒలు నిర్వహిస్తున్న విధులను, ఓటింగ్ తీరును నిశితంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ మైక్రో అబ్జర్వర్లకు నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. తమ విధి నిర్వహణలో ఏవైనా అనుమానాలు వస్తే తమ ఫోన్ నెంబరుకు (9154690377) తెలియజేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్ఎ.రామన్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు మాక్‌పోల్, ఓటింగ్ గది, పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించాలన్నారు. జిల్లా యంత్రాంగం గుర్తించిన 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను నియమించడంతోపాటు వారికి రెండు విడతలు శిక్షణ అందించామన్నారు. వారికి అందించిన నిర్దిష్ట ఫార్మాట్‌లో పేర్కొన్న అంశాలవారీగా వారి పరిశీలన చేసిన వాటిని నివేదించాలన్నారు. ఈ నెల 13న పోలింగ్ జరుగుతుందని, ఈ ధృష్ట్యా ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు సంబంధిత రిసెప్షన్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లు చేరుకోవాలన్నారు. 13న తేదీ పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రానికి చేరుకుని సంబంధిత నివేదికను అందజేయాల్సి ఉంటుందన్నారు. ఒకే ప్రాంతంలో ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నచోట అన్ని పోలింగ్ కేంద్రాల్లో సమాచారాన్ని పరిశీలించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు కేవలం పోలింగ్ విధానాన్ని పరిశీలించాలే తప్ప మీడియా తదితరులతో సంబాషించడం వంటివి చేయకూడదన్నారు. మైక్రో అబ్జర్వర్లకు ఏమైనా సమస్య ఉత్పన్నమైతే తమ ఫోన్ నెంబరు 9491041437కు చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల విధి నిర్వహణకు సంబంధించి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, సమగ్ర శిక్షాభియాన్ ఏపిసి బి.సోమశేఖర్, ఎల్‌డిఎం నీలాద్రి, కలెక్టరేట్ ఎఒ కె.కాశివిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం

మార్పు కోరుకుంటే సరిపోదు.. ఓటు వేసి మార్పు చూడాలి - టేలర్ స్విఫ్ట్

సమస్యల తీరం.. పోలవరం

రోడ్ల అధ్వానంతో గిరిజనులు విలవిల

నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాల లేమి

కానరాని ఉన్నత విద్యాసంస్థలు

ఉపాధి కోసం కూలీలుగా నిరుద్యోగులు

ముంపు బాధిత ప్రజలకు నేటికీ అందని పరిహారం

బొర్రంపాలెంలో నిర్మాణ దశలోనే ఉన్న ఆసుపత్రి

జీలుగుమిల్లి మండలంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

పోలవరం ప్రాజెక్టు అంటేనే దేశవ్యాప్తంగా పేరొందింది. అటువంటి జాతీయ ప్రాజెక్టు నిర్మిస్తున్న పోలవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకుంది. విలీన మండలాలను కలుపుకుని ఏడు మండలాలతో అతి పెద్ద నియోజకవర్గంగా నిలిచింది. కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాలు తప్పితే పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతో పోలవరం నియోజకవర్గం మొత్తం పూర్తి ఏజెన్సీ ప్రాంతంగా ఉంది. ఇక్కడ గిరిజనులు, గిరిజనేతరులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పాలకుల అలసత్వంతో నియోజకవర్గంలో అభివృద్ధి అంతంతమాత్రమేనని చెప్పాల్సి వచ్చు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఉపశమన మాటలు తప్ప గిరిజనుల గోడు పట్టించుకునే వారే లేరని పలువురు వాపోతున్నారు.

నిర్మాణ దశలోనే బొర్రంపాలెం ప్రభుత్వాసుపత్రి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో సరైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ముంపు గ్రామాల ప్రజలకు నేటికీ పరిహారం అందక ముంపు ప్రాంతాల్లోనే మగ్గిపోతున్నారు. ప్రాజెక్టు పూర్తయితే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అవస్థలు పడలేక పునరావాస కాలనీల్లోకి వస్తే అక్కడ తాగునీరు, రోడ్లు, కరెంటు వంటి కనీస సౌకర్యాలు లేక నిర్వాసితులు తల్లడిల్లుతున్నారు. పునరావాస కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితి దర్శనమిస్తోంది. గిరిజన ప్రాంతమైన బుట్టాయగూడెం, కొయ్యలగూడెం వంటి మండలాల్లో ఉన్నత విద్య డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి కాలేజీల ఏర్పాటు గిరిజన విద్యార్థులకు కలగానే మిగిలిపోతుంది. ఎన్నిమార్లు అధికారులకు, ప్రభుత్వాలకు విన్నవించిన సమస్యలు పరిష్కారం కావడం లేదని జనం లబోదిబోమంటున్నారు.

మండలంలోని సాయం పాలెం, వీరభద్రవరం, అల్లంచర రాజుపాలెం, సింగరాయపాలెం, బంధంచర్ల, టి.నరసాపురం, పుట్టేపు, అప్పలరాజుగూడెం తదితర గ్రామాలు వెళ్లే రోడ్లన్నీ ఏళ్ల నాటి నుండి అభివృద్ధికి నోచుక అధ్వానంగా ఉన్నాయి. పాలకులు మారినా రోడ్ల దుస్థితి మారలేదు. బొర్రంపాలెం, టి.నరసాపురం వంటి పంచాయతీల్లో డ్రెయినేజీ సమస్య ప్రధానంగా కన్పిస్తోంది. మండలంలోని బొర్రంపాలెం గ్రామం మండలంలో అధిక జనాభాతోపాటు వ్యాపార రంగంలో ముందున్న పెద్ద పంచాయతీగా పేరొందింది. అటువంటి పంచాయతీ ప్రజలకు ప్రభుత్వ వైద్య అందని ద్రాక్షగా మారుతోంది. గ్రామంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో 2011లో అప్పటి ప్రభుత్వం 10 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.70 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే స్థల సేకరణలో జాప్యం వల్ల నిర్మాణం చేపట్టలేదు. తిరిగి 2016లో అప్పటి ప్రభుత్వం 15 పడకలుగా అప్‌గ్రేడ్ చేసి రూ.కోటి 49 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే స్థల సేకరణలో వివాదాలు చోటుచేసుకోవడంతో నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో వైసిపి అధికారం చేపట్టాక గ్రామస్థులు ఒత్తిడి తేవడంతో స్థానిక నాయకులు ఎంపీ, ఎంఎల్‌ఎ సహకారంతో 2021 మార్చి 16న నిర్మాణ పనులు చేపట్టారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి పునాది వేశారు. అయితే నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. అల్లంచర్ల కొత్తగూడెంలో ప్రభుత్వం 40 ఎకరాలు కేటాయించినా విత్తనశుద్ధి కేంద్రం అభివృద్ధికి నోచుకోలేదు. కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించారు. మండలంలోని కేవలంలో 1/1 సర్వే నెంబరులో పేదలకు ఇచ్చిన పట్టాలు ఆన్‌లైన్ చేస్తామని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు చేయకపోగా వైఎస్ఆర్ జలకళ బోర్లు మంజూరైన ఎక్కడా బోర్లు వేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొయ్యలగూడెంలో అమలు కాని హామీలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో దాదాపు 20 సంవత్సరాలుగా డిగ్రీ కళాశాల తెస్తామని ప్రతి రాజకీయ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అయితే ఏళ్ల గడుస్తున్నా వారి హామీలు మాత్రం కాపడం లేదు. మండలంలో ప్రధానంగా ఫైర్‌స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోలీస్ స్టేషన్ చుట్టూ కమర్షియల్ కాంప్లెక్స్, 30 పడకల ఆసుపత్రి, అండర్ పాస్ డ్రైయినేజీ ఏర్పాటుకు ఎంఎల్‌ఎ, ఎంపీలు హామీలు ఇచ్చారు. అయితే ఒక్కటి కూడా నెరవేరలేదని గతంలో 30 పడకల ఆసుపత్రిని ఆరు పడకల ఆసుపత్రిగా మార్చారు. అయితే గత పాలకులు వంద పడకల ఆసుపత్రిగా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ కార్యరూపం దాల్చలేదు.

నిర్మాణం దశలో నిలిచిన పోయిన పునరావాస కాలనీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నియోజకవర్గంలో ప్రధాన మండలంగా చెప్పుకునే బుట్టాయగూడెంలో ఏజెన్సీ విద్యార్థులు విద్య అభ్యసించేందుకు కూడా ప్రధాన కేంద్రంగా ఉంటుంది. ఇటువంటి తరుణంలో డిగ్రీ కళాశాల నిర్మాణం ప్రారంభం దశలోనే ఉండటంతో డిగ్రీ, ఆపై చదివే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. కాలేజీ నిర్మాణానికి గతంలో అప్పటి ప్రభుత్వం ఐదెకరాల భూమి కేటాయించారు. రూ.కోటి వ్యయంతో నిర్మాణం ప్రారంభించారు. రూ.40 లక్షల మేర పనులు జరిగాయి. రూ.20 లక్షలు మాత్రమే నిధులొచ్చాయని, మిగిలిన బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో నిర్మాణం ముందుకు సాగలేదు. నిర్వాసిత గ్రామాలకు చెందిన విద్యార్థులు బుట్టాయగూడెంలో డిగ్రీ కళాశాల నిర్మాణం కాకపోవడంతో జంగారెడ్డిగూడెం, ఏలూరు, రాజమండ్రి వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ ప్రయివేటు కళాశాలలో చదవడానికి వేలాది రూపాయలు చెల్లించి ప్రత్యేక గదులు అద్దెకు తీసుకొని ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం డిగ్రీ కళాశాల నిర్మాణంతోపాటు హాస్టల్ నిర్మాణం కూడా చేయాలని డిగ్రీ విద్యార్థులు పలుమార్లు పోలవరం ఎంఎల్‌ఎ వెంకటేష్, ఐటిడిఎ పిఒ సూర్యతేజకు విన్నవించుకున్నారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎంఎల్‌ఎ సొంత మండలంలో కూడా ప్రజలను సమస్యల వెంటాడుతూనే ఉండటం చర్చనీయాంశమైంది.

బుట్టాయగూడెంలో నిర్మాణ దశలో ఉన్న డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలోని గూటాల పంపింగ్ స్కీమ్ ద్వారా దాదాపు రెండు వేల ఎకరాల పంట సాగు నిమిత్తం అందే నీరు గోదావరిలో నీటిమట్టం తగ్గిపోవడంతో అందని పరిస్థితి ఏర్పడి పంటలు ఎండిపోతున్నాయి. కడమ్మ ఎత్తిపోతల పథకంలో కొన్ని సమస్యలు తలెత్తడంతో వాటిని పరిష్కరించక పథకం ద్వారా నీటి సరఫరా ఆగిపోవడంతో తద్వారా రెండు వేల ఎకరాలు కొంతమేర పొలాలు కూడా ఎండిపోతున్న పరిస్థితి. ఎల్‌ఎన్‌డి పేట రిజర్వాయర్ ద్వారా దిగువన ఉన్న పంట పొలాలు కూడా ఎండిపోయిన పరిస్థితులు ఉన్నాయి. సత్యనాయి తాగునీటి సరఫరా పథకం ద్వారా అందించే తాగునీరు గోదావరిలో నీటిమట్టం తగ్గడంతో సుమారుగా 700 గ్రామాల్లో నీటి సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది సంవత్సరాలుగా పోలవరం మండలంలో పోలవరం, స్పానాలకుంట నుంచి ముత్యాలరావుపేట, దొండపూడి, పేద్దాల గ్రామాల నుంచి రోడ్లు అధ్వానంగా మారడంతో బస్సు ప్రయాణం లేక ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. గూటాల నుంచి దాదాపుగా పోలవరం వరకు అన్ని గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల దాని ద్వారా వచ్చే దోమలు వల్ల వచ్చే వ్యాధులకు ప్రజలు లబోదిబోమంటున్నారు. పోలవరంలో శ్మశాన వాటిక లేక ప్రజలు ఎవరైనా చనిపోతే కొవ్వూరు తీసుకెళ్లాల్సి వస్తుందని, శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యల వలయంలో జీలుగుమిల్లి..★★★

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో పలు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ముసలగలంపల్లి, అంకంపాలెం, తాటియాకులగూడెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ఆపేశారు. చంద్రమ్మ కాలనీ నుంచి జీలుగుమిల్లి ప్రధాన రహదారి వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదు. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంకవారిగూడెం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన రావడంతోపాటు రెండు దఫాలుగా గ్రామ సభలు కూడా ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో గ్రామసభలను అడ్డుకోవడంతో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే ఎప్పుడు ఏ సమస్య వచ్చి పడుతుందో తెలియక గిరిజనులు తల్లడిల్లుతున్నారు. మండలంలో పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా వేలేరుపాడు మండలంలోని 19 గ్రామాల నుంచి 11 మండల కుటుంబాలు పునరావాస గ్రామాలకు తరలొచ్చాయి. అయితే కొన్ని గ్రామాల్లో వారికి కావాల్సిన కనీస వసతులను ప్రభుత్వం ఇటీవల కల్పించింది. రాచన్నగూడెం పంచాయతీ పరిధిలో నివాసముంటున్న శివగిరి గ్రామంలో శ్మశాన వాటికకు సంబంధించి కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో రెవెన్యూ అధికారులు వేరే స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అదే విధంగా సిరివాకలో శ్మశాన వాటిక సమస్య ఉంది. అంకన్నగూడెం పంచాయతీ పరిధిలో తెల్లవరం నిర్వాసిత కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా వచ్చిన పునరావాస గ్రామాల్లోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మౌలిక వసతులు, ఉపాధి చూపడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపాకగొమ్ము పంచాయతీలో నిర్వాసితుల కోసం చేపట్టిన ఇళ్ల నిర్మాణం సాగుతూనే ఉంది.

కలగానే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం..★★★

ఏడొందల గ్రామాలకు తాగునీటి సరఫరా లేక అవస్థలు..

రైతుల రుణమాఫీ ఇండియా వేదికతోనే సాధ్యం

కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి హరికుమార్ రాజు

ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి హరికుమార్ రాజు

ప్రజాశక్తి - గణపవరం

రైతుల రుణాలను మాఫీచేసేది ఇండియా వేదిక మాత్రమేనని, ఇండియా వేదిక అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఉంగుటూరు నియోజకవర్గం ఎంఎల్‌ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్ రాజు తెలిపారు. ఆదివారం చికలపాడు గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. హరికుమార్ రాజు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఇండియా వేదిక ప్రచురించిన కరపత్రాలను అందజేసి మేనిఫెస్టోను వివరించారు. మతతత్వ బిజెపిని దాని తొత్తు పార్టీలను ఓడించాలన్నారు. కేంద్రంలో ఇండియా వేదిక అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జె.చంద్రశేఖర్, కాంగ్రెస్ నియోజకవర్గ యువజన అధ్యక్షులు సాయి నాగబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు పరిపాలన మళ్లీ కావాలి

రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ తనయుడు నిఖిల్‌రత్న

ప్రజాశక్తి - తణుకురూరల్

చంద్రబాబు పరిపాలన మళ్లీ కావాలని మహిళా లోకం ముక్తకంఠంతో కోరుకుంటోందని తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. ఆదివారం ఆమె అత్తిలి మండలం పాలూరు, వరగూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి దుర్మార్గ పాలన పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణతులసి మాట్లాడుతూ వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మళ్లీ వస్తేనే మహిళలకు భరోసా ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1,500, బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15,000 చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తారని పేర్కొన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

తణుకు ఆంధ్రా షుగర్స్ ప్రాంగణంలో టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా షుగర్స్ జెఎండి పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ రాధాకృష్ణ మంచి మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. అనంతరం రాధాకృష్ణ సిబ్బందిని ఓట్లు అభ్యర్థించారు.

సైకిల్ గుర్తుపై ఓటువేసి రాధాకృష్ణను గెలిపించాలని ఆరిమిల్లి రాధాకృష్ణ తనయుడు ఆరిమిల్లి నిఖిల్ రత్న తెలిపారు. ఇరగవరం మండలం అయిసపర్రు గ్రామంలో నిఖిల్ రత్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే వైసిపిని గెలిపిస్తాయి

వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్

ప్రచారం చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వైసిపిని మరలా గెలిపిస్తాయని ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పి.అంకంపాలెం, కామయ్యపాలెం, దర్భగూడెం పంచాయతీల్లో వైసిపి పోలవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రతి గడపకూ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ప్రజలు మళ్లీ వైసిపికి ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం పొంతన లేని అబద్ధపు హామీలు ఇస్తున్నారని, అటువంటి మోసపూరిత మాటలు నమ్మొద్దని తెలిపారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరలా వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు ఆధ్వర్యంలో దర్భగూడెం జాతీయ రహదారి నుండి లక్ష్మీపురం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్ల పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత

జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి

ప్రజాశక్తి – ఏలూరు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేసిన జేసి

ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి సూచించారు. స్థానిక సర్ సిఆర్ఆర్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆదివారం జాయింట్ కలెక్టర్ తపాలా బ్యాలెట్ వినియోగించుకున్నారు. అనం తరం ఆమె మాట్లాడుతూ ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

1,088 మంది హోమ్ ఓటింగ్ వినియోగం

ప్రజాశక్తి – భీమవరం

ఈనెల 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన హోం ఓటింగ్‌లో వయోవృద్ధులు, వికలాంగులు 1,088 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 85 సంవత్సరాలు పైబడి ఉన్న వయోవృద్ధులు, 40 శాతం పైబడి వికలత్వం ఉన్న వికలాంగులు మొత్తం 1,118 మంది హోం ఓటింగ్‌కు అర్హులు కాగా హోం ఓటింగ్ గడువు తేదీ ముగిసిన నాటికి 1,088 ముంది ఓటును వినియోగించుకోవడం జరిగిందన్నారు. 30 మంది ఓటర్లు కొన్ని అనివార్య కారణాల వల్ల తమ ఓటు హక్కును వినియోగించుకుని యండలేదని తెలిపారు. మే 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ నియోజకవర్గాల వారికి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వీస్ ఓటర్లుగా నమోదైన 888 మందికి పోస్టల్ బ్యాలెట్‌ను వారికి పంపడం జరిగిందని, వారు ఓటింగ్ అనంతరం పోస్టల్ బ్యాలెట్‌ను తిరిగి పంపడం జరుగుతుందని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

ఉండిలో హోమ్ ఓటింగ్ పూర్తి

ఉండి : ఉండి నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ పూర్తయినట్లు ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండి, కాళ్ల, పాలకోడేరు, ఆకివీడు మండలాలు, ఆకివీడు మున్సిపాలిటీ పరిధిలో మూడురోజులుగా నిర్వహిస్తున్న హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారంతో విజవంతంగా పూర్తయిందని తెలిపారు. ఉండి నియోజకవర్గం పరిధిలో మొత్తం 151 ఓటర్లకు 146 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారని తెలిపారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా : నోబుల్

ప్రజాశక్తి – కైకలూరు

కాంగ్రెస్ అభ్యర్థిగా ఒక్క అవకాశం ఇస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని రామవరం, సీతనపల్లి, సోమేశ్వరం గ్రామాల్లో విజయాభవ పేరిట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ మేనిఫెస్టో పత్రాలను అందజేశారు. ఆయా గ్రామాల్లోని ప్రతి కుటుంబం మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ గ్రామంలో ఒక్క తాటాకు ఇల్లు లేకుండా పక్కా ఇల్లు నిర్మాణానికి కృషి చేస్తానని, ఎన్‌సి వాడలను అభివృద్ధి చేస్తానని గ్రామస్తుల సమక్షంలో హామీ ఇచ్చారు.

రాజ్యలక్ష్మి గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి – టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి గెలుపు కోసం వైసిపి మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం టి.నరసాపురంలో కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే, జగన్ ముఖ్యమంత్రి అయితేనే పేదలకు సంక్షేమం అందుతోందని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సర్వేశ్వరరావు వివరించారు. మేనిఫెస్టోకు సంబంధించిన హామీలపై అవగాహన కల్పించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తాం

మార్నింగ్ కాఫీ క్లబ్

ప్రజాశక్తి – భీమవరం రూరల్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడంలో చలి వేంద్రాలు ఎంతో దోహదపతున్నాయని, ప్రతి చోటా చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం మంచిదని, చలి వేంద్రాల ఏర్పాటులో మా సహకరం ఎల్లపవిడూ ఉంటుందని మార్నింగ్ కాఫీ క్లబ్ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ గుప్తా, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక డిఎన్ఆర్ కళాశాల మెయిన్ రోడ్డు వద్ద డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మార్నింగ్ కాఫీ క్లబ్ సౌజన్యంతో నిర్వహించారు. మా క్లబ్ సభ్యుల సహకారంతో రెండురోజులపాటు నిర్వహిస్తున్నామని, అందరూ ఇటువంటి మంచి కార్యక్రమాలకు ముందు రావాలని వారు పిలుపునిచ్చారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లారావు, కార్యదర్శి పి.సీతారామరాజు మాట్లాడుతూ దాతలందిస్తున్న సహకారం అద్వితీయమని, నెలరోజులపాటు ఈ ప్రాంతంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ మూర్తి, కనగర్ల రామకృష్ణ, గాదె నాగేశ్వరావు, గుండు సుమూర్తి, అనంతపల్లి సుబ్బారావు, కురిశెట్టి శ్రీనివాస అప్పారావు పాల్గొన్నారు.

'రాధాకృష్ణ గెలుపు బాధ్యత యువతదే'

ప్రజాశక్తి – తణుకు

టిడిపి అభ్యర్థి ఆరమిల్లి రాధాకృష్ణను గెలిపించుకోవాల్సిన బాధ్యత యువతపైనే ఉందని సినీ హీరో, టిడిపి నాయకుడు నారా రోహిత్ అన్నారు. ఆదివారం స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో యువత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోకి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, దీంతో యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయిందన్నారు. రాక్షసుడిని ఇంటికి పంపే సమయం దగ్గర పడిందని, యువత ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేయించవలసిన బాధ్యత ఉందన్నారు. పెదనాన్న చంద్రబాబు నాయుడు 73 సంవత్సరాల వయసులో కూడా ప్రజల కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని ముఖ్యమంత్రిని చేయవలసిన అవకాశం వచ్చింది అన్నారు. మన భవిష్యత్తు మన చేతిలోనే ఉందని, ఓటుని ఆయుధంగా ఉపయోగించుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. కోట్లాది రూపాయలు ఆదాయాన్ని వదులుకొని పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల కోసం కష్టపడుతున్నారని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసిపి ప్రభుత్వం కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, హింసించిందని ఆరోపించారు. కూటమి అభ్యర్థి రాధాకృష్ణ మాట్లాడుతూ వైసిపిని ఇంటికి పంపించడానికి కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయని, ఈ కొద్ది రోజుల్లో యువత టిడిపి గెలుపుకు కృషి చేయాలని కోరారు. కూటమి అధికారంలోకి రాగానే సంవత్సరానికి 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందన్నారు. పార్టీకి అండగా నిలుస్తున్న రోహిత్‌కి రాధాకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో యువ నాయకుడు నిఖిల్ రత్న, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక్కడ పూర్తి.. అక్కడ ప్రారంభం..!

(మొదటి పేజీ నుంచి)

బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వైసిపికి ఎక్కువగా పోలైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుందో, లేదో జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపులో వెల్లడికానుంది.

11,874 మంది చే పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ఏలూరు జిల్లాలో ఆదివారం సాయంత్రం నాటికి 11,874 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1,402 మంది, కైకలూరులో 1,305 మంది, నూజీవీడులో 1,452 మంది, చింతలపూడిలో 1,662 మంది, పోలవరంలో 2,308, ఏలూరులో 1,827 మంది, దెందులూరులో 1,918 మంది పోస్టల్ బ్యాలెట్‌ను ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా నీట్

(మొదటి పేజీ నుంచి)

హాల్లోకి తీసుకుని రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థినులు ఎలాంటి ఆభరణాలూ ధరించకూడదని ముందే తెలియజేయడంతో చాలామంది ఆభరణాలు లేకుండానే వచ్చారు. కొంతమంది మెడలో గొలుసులు, చెవి రింగులు వంటివి పెట్టుకుని రావటంతో వాటిని గేటు వద్దే తీయించి లోపలికి పంపించారు. మొత్తం మీద ఏలూరులో నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

భీమవరంలో 929 మంది విద్యార్థులు హాజరు

భీమవరం: నీట్ ప్రవేశ పరీక్ష భీమవరంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 929 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక భారతీయ విద్యాభవన్స్ పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు 952 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 929 మంది హాజరయ్యారు. సుమారు 23 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:20 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్షా కేంద్రం కోఆర్డినేటర్ ఎల్‌వి.రమాదేవి తెలిపారు.

నేటి నుంచి ఆరు రోజులు పోస్టల్ బ్యాలెట్

(మొదటి పేజీ నుంచి)

పూర్తి చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా మొట్టమొదటిగా హోమ్ ఓటింగ్‌ను ప్రారంభించానన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన హోమ్ ఓటింగ్‌ను 80 శాతం పూర్తి చేశామని, ఆదివారంతో నూరు శాతం పూర్తవుతుందని అన్నారు. 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలో సుమారు 82 నుండి 85 శాతం పోలింగ్ నమోదైందని, దీనిని 2024 ఎన్నికల్లో మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 14.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటికే 13.20 లక్షల ఓటర్ స్లిప్‌లు ఇంటింటికీ పంపిణీ చేశామని చెప్పారు. ఇప్పటికే ఇవిఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేసి సంబంధిత నియోజకవర్గాలకు తరలించడంతోపాటు కమిషనింగ్ కూడా పూర్తి చేశామని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ఇవిఎంలు వివిప్యాట్‌లు 10 నుంచి 15 వరకు అదనంగా అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇవిఎంలు, సిబ్బంది తరలింపునకు అవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. దీనికి అవసరమైన సుమారు 520 ప్రభుత్వ, ప్రయివేటు వాహనాలను సిద్ధం చేస్తామన్నారు. 14,300 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు, అలజడులు సృష్టించినా, ప్రోత్సహించినా ఎటువంటి చర్యలైనా తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఇప్పటి వరకూ 14 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశామని తెలిపారు. రూ.2.10 కోట్ల నగదు, మద్యం సీజ్ చేశామన్నారు. జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల మాట్లాడుతూ జీరో శాతం హింసాత్మక సంఘటనల నమోదుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే సిఆర్‌పిఎఫ్, జిల్లా పోలీస్, నాగాలాండ్ ఫోర్స్ బలగాలు జిల్లాలో ఎన్నికల భద్రత కోసం పని చేస్తున్నాయన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అలజడులు, అల్లర్లను ప్రోత్సహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు.

ఇండియా వేదికతోనే అభివృద్ధి

(మొదటి పేజీ నుంచి)

సెంటర్ మీదుగా రైతు బజార్ వరకు సాగింది. తీన్మార్ డప్పులతో ఎర్రజెండా రెపరెపలతో రోడ్డుషో జరిగింది. నగరంలో పలు సెంటర్లలో జరిగిన సభలకు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మరోసారి బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదన్నారు. పదేళ్ల కాలంలో దేశంలో చేసిన అభివృద్ధి చెప్పుకోవడానికి ఏమీ లేక మత ప్రాతిపదికపై బిజెపి ఓట్లను అభ్యర్థిస్తోందన్నారు. 2014 నుంచి నేటి వరకు దేశంలో ధరల నియంత్రణ జరగలేదన్నారు. నిరుద్యోగం, రైతు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రజలంతా ఆలోచించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్, కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం కమిషనింగ్ పరిశీలన

ప్రజాశక్తి – తణుకు రూరల్

తణుకు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో జరుగుతున్న ఇవిఎం కమతిషనింగ్‌ను ఆదివారం సుమిత్ కుమార్ పరిశీలించారు. అదేవిధంగా నేడు జరగబోవు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటరును జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు) పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రతి అధికారి, సిబ్బంది ఇవిఎంల వినియోగం, బ్యాలెట్ పేపరు అమరికపై క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ప్రతి విషయాన్ని పూర్తిగా తెలుసుకున్నప్పుడే సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. మాక్ పోల్ నిర్వహణ, తదితర అంశాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేయాలని, వారికి ఏమన్నా అభ్యంతరాలు ఉంటే వెనువెంటనే నివృత్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు.

'టిడిపి కూటమిని గెలిపించాలి'

ప్రజాశక్తి – కుక్కునూరు

మండల కేంద్రంలోని అన్ని వార్డులకు ప్రచారం చేస్తూ, కూటమి అభ్యర్థుల గెలుపు కాంక్షిస్తూ టిడిపి అధ్యక్షుడు ములిసెట్టి నాగు ఆధ్వర్యంలో భారీ జనసందోహంతో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రచారం చేశారు. ముందుగా ఆ పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి జరగాలన్న, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగాలన్న, కుక్కునూరులో పూర్తిగా పాడైన రహదారి కొత్త రహదారి నిర్మించాలి అంటే, అలానే మన గోదావరి ప్రాంతంలో ఇసుక ఉండి ఇసుక దొరకకుండా కనీస మౌలిక సదుపాయాలు సోచుకోని దౌర్భాగ్య పరిస్థితిలో మనం ఉన్నామన్నారు. అందుకే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీ నాయకత్వంలో బలపడి కూటమి అభ్యర్థులైన ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

మామ గెలుపు కోసం కోడలు ప్రచారం

ప్రజాశక్తి – కలిదిండి

వైసిపి కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు పెద్ద కోడలు దూలం శ్రీఅనుపమ మండలంలోని కోరుకొల్లులో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లే ముందు డిఎన్ఆర్ పెద్దకోడలు వస్తున్నారని పలువురు చెబుతూ వెళ్లడం జరిగింది. జగనన్న ఆశీస్సులతో దూలం నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారని, మీరు కూడా ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, నాయకులు నంబూరి శ్రీదేవి పాల్గొన్నారు.

'వాలంటీర్లతో బలవంతపు రాజీనామాలు వైసిపికి తగవు'

ప్రజాశక్తి – కొయ్యలగూడెం

వాలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయించడం వైసిపికి తగదని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. కొయ్యలగూడెంలో ఆమె నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వాలంటీర్లతో రాజీనామా చేయించి వైసిపి మేనిఫెస్టో గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. వైసిపి నేతల నుంచి బెదిరింపు ఫోన్లు రావడంతో కొంతమంది వాలంటీర్లు ఇష్టం లేకపోయినా రాజీనామాలు చేయాల్సి వస్తుందన్నారు. పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేసే విధానంలో కూడా వైసిపి ప్రభుత్వం మీనమేషాలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల జోనల్ కమిటీ మెంబర్ చోడిపిండి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మార్క్స్ సిద్ధాంతం ప్రపంచానికే ఆదర్శం

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

పెట్టుబడిదారీ సమాజానికి వ్యతిరేకంగా, పీడిత వర్గానికి అండగా కార్ల్ మార్క్స్ రూపొందించిన సిద్ధాంతం యావత్ ప్రపంచానికే మార్గదర్శకమని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. స్థానిక పవర్ పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం మార్క్స్ 206వ జయంతి కార్యక్రమం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత మార్క్స్ చిత్రపటానికి రవి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్సిస్ట్ మహాపాధ్యాయుడు, పీడిత ప్రజల ఉద్యమ నిర్మాత కార్ల్‌మార్క్స్ 206వ జయంతి కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అప్పటివరకు దోపిడీకి గురయ్యే ప్రపంచం ఉన్న తరుణంలో ఈ ప్రపంచాన్ని ఈ స్థితి నుంచి, దోపిడీ రహిత ప్రపంచాన్ని రూపొందించే స్థితికి మార్చగలిగే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని, అది ఆచరణకు యోగ్యమయ్యే సిద్ధాంతమని తెలిపి, రూపొందించిన గొప్ప వ్యక్తి మార్క్స్ అని కొనియాడారు. పేదరికం పెరగడానికి శ్రమ, దోపిడీయే కారణమని, అటువంటి శ్రమ దోపిడీని అంతం చేయడం ద్వారానే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని, మార్క్స్ చెప్పిన సిద్ధాంతాన్ని ఈ భారతదేశంలో తీసుకు రావడమే ఆయనకు మనం ఇచ్చే ఘననివాళులని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.జగన్నాధ రావు, కోటేశ్వరరావు, ఇస్సాకు, ఎస్ఎస్.రమేష్, వివిఎన్.ప్రసాద్, కట్టా సత్యనారాయణ, శారద పాల్గొన్నారు.

భీమవరం: ప్రపంచ మేధావి కార్లమార్క్స్ రచనలు ప్రపంచ మానవాళికి మార్గదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు.

జయంతి కార్యక్రమంలో వక్తలు

ఏలూరు అర్బన్: మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న రవి, నాయకులు

స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో కార్లమార్క్స్ జయంతి వేడుకలు సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి గోపాలన్ పూలమాల వేసి, నివాళులర్పించి మాట్లాడారు. పెట్టుబడి గ్రంథంలో పెట్టుబడి దారుడు కార్మికుల శ్రమ దోపిడీ వల్ల లాభం వస్తుందని నిరూపించిన మహా వ్యక్తి కార్ల్‌మార్క్స్ అని కొనియాడారు. ఆయన జీవితం ప్రపంచ మానవాళికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, పట్టణ నాయకులు డి.నాగు, కె.కృష్ణ నాగరాజు, చల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు: కారల్‌మార్క్స్ కష్టజీవులు, కార్మికవర్గ విముక్తి కోసం, సమ సమాజం కోసం జీవితాన్ని అర్పించాడని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. కారల్ మార్క్స్ 206వ జయంతి పవర్ పేటలోని అన్నే భవనంలో ఆదివారం నిర్వహించారు. సభకు జింగిల్ బెల్స్ విద్యాసంస్థల డైరెక్టర్ వి.సురేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కారల్‌మార్క్స్ గొప్ప దార్శనికుడు, తత్వవేత్త, ఆర్థికవేత్త, సిద్ధాంతకర్త అని కొనియాడారు. ఆయన జయంతిని, వర్ధంతిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 26 సంవత్సరాల నాడు జన్మించిన కారల్‌మార్క్స్, ఆయన చేసిన కృషి, ప్రాధాన్యత, చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ కారల్ మార్క్స్ చరిత్ర తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, న్యాయ శాస్త్రం అధ్యయనం చేసి వాటిని మరింత పరిపుష్టం చేసిన వ్యక్తి అని అన్నారు.

భీమవరం:నివాళులర్పిస్తున్న గోపాలన్, నాయకులు

పౌర హక్కుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ఎం కట్టా మాట్లాడుతూ శ్రీశ్రీ లాంటి ఎందరికో మార్గ నిర్దేశం చేసినవాడు మార్క్స్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, బి.సోమయ్య, పి.వనిత, వై.కావ్య శ్రీవల్లి, నికిత చందు, దుర్గాభవాని పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి – కాళ్ళ

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత చదివిన స్కూల్‌లో సమావేశం కావడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా అప్పటి పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. చదువు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. కోపల్లె హైస్కూల్ అభివృద్ధికి కృషి చేస్తామని, తమ వంతు సహకారంగా ఆర్థిక సహాయం అందించి, పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పూర్వ విద్యార్థుల కమిటీనీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బూడి వెంకట పర్రాలు, బురాడ వెంకటకృష్ణ, వెంకటకృష్ణ, రాజేంద్ర, పరాలు, జీవన్, గణపతి, రాము, నాగపద్మ, గాయత్రి, దుర్గ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి – మొగల్తూరు

మొగల్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్టుకొమ్మలను తొలగించేందుకు విద్యుత్ షాపులు నిలిపివేస్తునందున సహకరించాలని ఆయన కోరారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రముఖ అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు పాకెర్ల సుదర్శనం

ప్రజాశక్తి – భీమవరం రూరల్

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని, యువత క్రీడలు పట్ల ఆసక్తి కనబరచాలని ప్రముఖ అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు పాకెర్ల సుదర్శనం(102) అన్నారు. ఆదివారం ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో గునుపూడిలోని పాకెర్ల నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ ప్రస్తుతం యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారని, తాను చిన్నతనం నుంచి క్రీడలతోనే జీవితం గడిపానని అన్నారు. 96 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియా దేశంలో అథ్లెటిక్స్‌లో పాల్గొని బంగారు, వెండి 18 పతకాలను సాధించానని, మొత్తం 62 దేశాలలో టోర్నమెంట్లో పాల్గొని ఒక సామాన్య పిఇటిగా ఉంటూ క్రీడల్లో విజయం సాధించానని అన్నారు. జిల్లా సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సుదర్శనం 102 ఏళ్లలో కూడా ఆరోగ్యంగా ఉన్నారంటే ఆయన ప్రయాణ సాధనం సైకిల్ అని, ఇటువంటి క్రీడాకారులకు ప్రభుత్వం ఎటువంటి సహకారం అందివ్వకపోవడం బాధాకరమని అన్నారు. భీమవరం పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ 102 ఏళ్ల వయసులో కూడా సుదర్శనం క్రీడల గురించి చర్చించడం గొప్ప విశేషమని తెలిపారు. అనంతరం సుదర్శనంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుదర్శనం కుమారులు పాకెర్ల శామ్యూల్, డి.రాజా కుమార్, పి.రాజబాబు పాల్గొన్నారు.

మూగజీవాలకు నీటి తొట్టెలు ఏర్పాటు

ప్రజాశక్తి – పాలకొల్లు

వేసవికాలంలో అ మాయకపు జీవుల ప్రాణ రక్షణ కోసం రామ్ శ్లోక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన దాతల సహకారంతో నీటి తొట్టెలు ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన గోపాలకృష్ణ అన్నారు. మూగజీవులకు నీరు అందించడానికి పాలకొల్లు రామ్ శ్లోక్ ఫౌండేషన్ ఆదివారం శ్రీకారం చుట్టింది. పాలకొల్లు చుట్టు పక్కల వున్న ప్రాంతాలను పరిశీలించి ఎక్కడైతే నీరు అందక ఆకలి, దప్పికలతో అలమటిస్తున్న

నీటితొట్టెలతో గోపాలకృష్ణ

మూగజీవులు వున్నారో.. ఆ ప్రాంతంలో నీటి తొట్టను శాశ్వత ప్రతిపాదన ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు తెలిపారు. ప్రతి రోజూ వేసవి కాలంలో నిరంతరాయంగా ఆయా ప్రాంతాల్లోని సభ్యుల ద్వారా నీటిని నింపి, దాహార్తి తీర్చడానికి సహకారం అందిస్తున్న సంస్థ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

జనసేనలోకి పలువురు

రాష్ట్రంలో జగన్ రాక్షస పాలన అంతమొందించేందుకు జనమంతా ఏకమవుతున్నారని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం బి కొండేపాడు నుంచి వైసిపికి చెందిన సర్పంచి కట్ట దానయ్య, మాజీ ఎంపిపి కట్ట పద్మావతిలతో పాటు వారి అనుచరులు, ఆ గ్రామానికి చెందిన నెంబర్లు, నాయకులు, కార్యకర్తలు బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో ఆదివారం జనసేనలోకి చేరారు. ఈ సందర్భంగా సర్పంచి కట్ట దానయ్య మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన తమకు నిధులు, విధులు లేకుండా జగన్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, ఆ పాలనకు చరమగీతం పాడేందుకు వైసిపి నుంచి జనసేనలోకి చేరుతున్నామన్నారు. అనంతరం జనసేన యువనాయకులు బొలిశెట్టి రాజేష్ జనసేనలోకి చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో పనిచేసిన వారందరికీ సమాన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న బాబాలు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి – మొగల్తూరు

వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు మజ్జిగ చేలవేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు అనంతపల్లి హరినాథ్ బాబాలు అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో బాలాజీ మొబైల్ ప్రోప్రైటర్, ఆర్యవైశ్య యువజన సంఘ కార్యదర్శి సీమకుర్తి బాలాజీ ఆర్థిక సాయంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘ సభ్యులు మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం బాటసారులకు మజ్జిగ అందించారు. ఆయా కార్యక్రమాల్లో యువజన సంఘం అధ్యక్షులు సంక గుప్త, అనంతపల్లి సాయిరామ్, అనిల్, మానేపల్లి చిన్న, ఉదగిరి రమేష్ ఉన్నారు.

7న భీమవరంలో 'అల్లూరి శత వర్ధంతి'

ప్రజాశక్తి – పెనుమంట్ర

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 7వ తేదీ మంగళవారం భీమవరంలోని అల్లూరి సీతారామరాజు స్మృతివనంలో అల్లూరికి ఘనంగా నివాళి సమర్పించే కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కార్యక్రమ నిర్వాహకులు వెల్లడించారు. వేదిక పద్ద ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో అంతా పాల్గొని నివాళులు అర్పించవలసిందిగా వారు కోరారు. రాలేని అభిమానులు ఆయా సోషల్ మీడియా హ్యాండిల్‌లో కూడా అల్లూరికి నివాళి అర్పించాలని కోరారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో రథ్ధి

ప్రజాశక్తి – మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కోపల్లెలో అమ్మవార్ల జాతర

ప్రజాశక్తి – కాళ్ళ

కోపల్లె గ్రామంలో కనకదుర్గమ్మ, పరాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉండి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాగ్ పార్టీ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కోపల్లె గ్రామానికి చెందిన బొంతు తేజ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఆదివారం బొంతు తేజను పరామర్శించారు.

రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం

కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్ఏ అభ్యర్థులు

ఆచంట కచేరి సెంటర్‌లో ఎన్నికల ప్రచార యాత్ర

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని పదేళ్ల క్రితం విమర్శించిన చంద్రబాబు, పవన్‌లు బిజెపితో జతకట్టి ఏకంగా ఎన్‌డిఎ కూటమిలో చేరారని కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, ఆచంట ఎంఎల్ఏ అభ్యర్థి నెక్కంటి వెంకటసత్యనారాయణ (సతీష్) అన్నారు. వారు ఆదివారం ఆచంట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార యాత్ర నిర్వహించారు. ఉదయం ఆచంట జ్యోతి గ్యాస్ కంపెనీ వద్ద నుంచి ప్రారంభమైన ప్రచారయాత్ర ఆచంట, కొడమంచిలి, చిన్నమల్లం, పెదమల్లం, కోడేరు, ముత్యాలవారిపాలెం, కరుగోరుమిల్లి పంచాయతీ కాలనీ, భీమలాపురం, వల్లూరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, పెనుమంచిలి, ఆచంట వేమవరం, ఆచంట టౌన్, ఇల్లపర్రు, ముళ్లపర్రు, సిద్ధాంతం వడలి, పెనుగొండ, మార్టేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్ఏ అభ్యర్థులు నాయుడు, వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యల గురించి చర్చించడానికి టిడిపి కూటమి, వైసిపి సిద్ధంగా లేవన్నారు. కేంద్రం చేస్తున్న అన్యాయం గురించి వారు మాట్లాడటం లేదన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి మత ఉద్రిక్తతలు తీసుకొస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన వారితో చేతులు కల్పితే రాష్ట్రాభివృద్ధి ఎలా సాధ్యపడుతుందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి అణచివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, సిపిఎం నేతలు సుర్నిడి వెంకటేశ్వరరావు, కుసంపూడి సుబ్బరాజు, సిర్రా నరసింహమూర్తి, ఎస్‌వివిఎన్.శర్మ, వి.అంజిబాబు, తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, మచ్చ సుబ్బారావు, రాజు, కొండేటి సత్యనారాయణ, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

పేదలు, కార్మికులు, కష్టజీవుల కోసం నిరంతరం పోరాడే కాంగ్రెస్ ఆచంట ఎంఎల్ఏ అభ్యర్థి నెక్కటి వెంకటసత్యనారాయణ(సతీష్)ను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. ఆచంటలో వెంకట సత్యనారాయణ (సతీష్) ఆదివారం ఎన్నికల ప్రచార యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మోడిని గద్దె దించకపోతే దేశానికి, రాష్ట్రానికి భవిష్యత్తు లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బిజెపి దానికి మద్దతునిస్తున్న పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని లౌకిక భారతదేశాన్ని కాపాడుకోవాలంటే ఇండియా వేదికను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి

పెనుమంట్ర :అప్రజాస్వామిక పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించి, మీ ఓటు ఇండియా వేదిక అభ్యర్థులకు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, ఆచంట ఎంఎల్ఏ అభ్యర్థి నెక్కంటి వెంకటసత్యనారాయణ(సతీష్) కోరారు. మార్టేరు సెంటర్‌లో ప్రచార వాహనంపై నుంచి వారు మాట్లాడారు. పదేళ్ల టిడిపి, వైసిపి ప్రభుత్వాలు అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని తిరోగమన బాట పట్టించాయన్నారు. నరసాపురం మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించడం వల్ల ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతుందన్నారు.

సావిత్రమ్మ సేవలు చిరస్మరణీయం

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

వర్ధంతి సభలో మట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

మానవతామూర్తి, శ్రామిక మహిళా ఉద్యమ నేత మారుబోయిన సావిత్రమ్మ సేవలు చిరస్మరణీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు. సావిత్రమ్మ మూడో వర్ధంతి సభ ఆమె గృహం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా సావిత్రమ్మ, ఆమె కుమారుడు లెనిన్‌బాబు చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో బలరాం ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఒక సాధారణ రైస్‌మిల్లు కార్మికురాలిగా జీవితం ప్రారంభించిన సావిత్రమ్మ అసాధారణ స్థాయికి ఎదిగారన్నారు. ఆకివీడులో రైస్‌మిల్లు కార్మిక ఉద్యమం ప్రారంభించిన ఆమె జిల్లాలోనే రైస్ మిల్లు కార్మిక ఉద్యమ నేతగా ఎదిగారన్నారు. సావిత్రమ్మ, ఆమె కుమారుడు లెనిన్‌బాబు మృతి పార్టీకి, సంస్థలకు తీరని లోటన్నారు. ఇక్కడ జరిగిన అన్ని ఉద్యమాల్లోనూ ఆమె ఎనలేని పాత్ర పోషించారన్నారు. పురుషులకు ధీటుగా ఉద్యమాల్లో పోలీసులను, నాయకులను ఎదుర్కొన్న నాయకురాలని ఆయన కొనియాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ సావిత్రమ్మ, లెనిన్‌బాబు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ట్రస్ట్ పేరుతో వారి కుటుంబం ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొక్క సత్యనారాయణ, డోకల లక్ష్మి, సందక ఉదయకుమారి, ఎస్.నూరిబాబు, బివి.వర్మ, డి.రవితేజ, ధనుష్, ఆర్‌జి.సతీష్, బి.అప్పారావు పాల్గొన్నారు.

రైసుమిల్లు కార్మికుల నివాళి

రైస్ మిల్లు కార్మికోద్యమనేత, ఐద్వా నాయకురాలు మారుబోయిన సావిత్రమ్మ స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు కొనసాగిస్తామని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. స్థానిక జవహర్ పేటలోని రైసుమిల్లు కూడలి వద్ద వర్ధంతి సభ నిర్వహించారు. సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ శ్రామిక మహిళల సమస్యలపై పోరాడిన సావిత్రమ్మ ఆకివీడు చరిత్రలో అజరామరంగా నిలుస్తారన్నారు. రైస్ మిల్లు యజమానులతో కార్మికుల సమస్యలపై చర్చించి వారితో ఒప్పందాలు జరపడం, శ్రామిక మహిళ నేతగా మహిళలను కలిపి ముందుకు నడపడం ఆమె శక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి.వర్మ, బొర్రా సత్యనారాయణ, ఎం.కృష్ణ, నారాయణ, సూర్యారావు, కొండ, స్వామి పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌లో 106 ఓట్లు పోలింగ్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ శనివారం నుంచి ప్రారంభమైందని తొలి రోజు 68, ఆదివారం 38 ఓట్లు పోలయ్యాయని ఆర్‌డిఒ, రిటర్నింగ్ అధికారి ఎం.అచ్యుత అంబరీష్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 112 హోమ్ ఓట్లు ఉన్నాయని తెలిపారు. నరసాపురం టౌన్‌లో 46, నరసాపురం మండలంలో 38, మొగల్తూరులో 28 ఉన్నాయని చెప్పారు. ఆరు టీములుగా ఏర్పడి నియోజకవర్గంలో ఓటింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

సెంటర్‌ను పరిశీలిస్తున్న సుమిత్ కుమార్

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - తణుకు

పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న ఇవిఎం మిషన్లను కూడా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది, అలసత్వం వహించొద్దని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయనతో పాటు తణుకు రిటర్నింగ్ అధికారి బివి.రమణ, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఏలూరు అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందని రిటర్నింగ్ అధికారి ముక్కంటి తెలిపారు. శనివారం 40 శాతం ఓటింగ్ పూర్తయిందని, మిగతా వారందరికీ పోస్టల్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వినియోగించుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఏలూరు నియోజకవర్గంలో పనిచేస్తూ నియోజకవర్గంలోనే ఓటు ఉన్నవారందరికీ ఐదు కౌంటర్లను ఏర్పాటు చేశామని, అలాగే ఇతర జిల్లాలో ఓటు ఉండి ఏలూరులో పని చేస్తున్న వారికి రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాల్లో ఓట్లు ఉండి ఏలూరులో పనిచేస్తున్న వారికి కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లందరూ వారి ఓటును వినియోగించుకున్నారన్నారు.

ఏలూరు టౌన్ :ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం వట్లూరులోని సిఆర్ఆర్ మహిళ కళాశాలలో ఉద్యోగులు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. సర్ సిఆర్ఆర్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ వినియోగం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. శనివారం, ఆదివారం ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్నారన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మూడు కౌంటర్ల ద్వారా 823 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అయితే వేరే నియోజక వర్గాల్లో పనిచేస్తున్న ఫారం 12 అప్లై చేసిన ఉద్యోగులకు బ్యాలెట్లు రాలేదని ఓటు వేయనీయలేదు. దీంతో ఉద్యోగులు అసహనానికి లోనయ్యారు. ఆదివారం ప్రశాంత వాతావరణంలోనే పోస్టల్ బ్యాలెట్ సాగింది. పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓటర్లకు ఇబ్బంది లేకుండా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించడం జరిగింది. ఎటువంటి రద్దీలేకుండా టోకెన్ విధానంలో ఓటింగ్ కేంద్రంలోకి ఐదుగురు చొప్పున పంపడంతో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ విజయవంతంగా సాగింది.

హోమ్ ఓటింగ్‌లో 95 మంది

హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 95 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికారులు వారి ఇంటి దగ్గరకు వెళ్లి హోమ్ ఓటింగ్ వేసే సదుపాయం కల్పించడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మే, 13వ తేదీన ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పోలింగ్ రోజున ప్రతి పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రతి రెండు గంటలకు ఒకసారి సమాచారం అందించే ఏర్పాట్లు చేశామని ఆర్ లావణ్య వేణి తెలిపారు. ఇవిఎంల కమిషనింగ్ కూడా జరుగుతుందన్నారు. స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు.

7న పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవచ్చు

చింతలపూడి : ఈ నెల ఏడో తేదీన పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవచ్చని చింతలపూడి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.అద్దయ్య తెలిపారు. పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల వద్ద తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4, 5 తేదీలలో ఎవరైనా ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోలేకపోతే ఏలూరులో జిల్లా కలెక్టర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఓటు హక్కు వినియోగించుకున్న డిఎస్‌పి రవిచంద్ర

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ద్వారా మంచి నాయకుడిని, ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఎన్ని పనులు ఉన్నా ఓటు హక్కు కచ్చితంగా వినియోగించుకోవాలని చెప్పారు.

ఉద్యోగులకు మరో అవకాశం
ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ

కైకలూరు :విధుల్లో ఉన్న ఉద్యోగస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించిందని ట్రెయినీ కలెక్టర్ టి.శ్రీపూజ తెలిపారు. ఆదివారం ఆమె కైకలూరు ఎన్నికల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వివిధ ప్రదేశాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 7, 8 తేదీల్లో ప్రత్యేక సెలవు తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగస్తులు ఏదైనా గుర్తింపు కార్డు, ఎపిక్ కార్డు వంటి ఆధారాలు తీసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉద్యోగులు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకున్నారు. ఆదివారం స్థానిక తాలూక సెంటర్‌లోని పాత తహశీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలింగ్ జరిగింది. కైకలూరు నియోజకవర్గంతో పాటు కృష్ణా జిల్లాలోని గుడివాడ, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు, గన్నవరం ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పది గంటల నుంచి ఉద్యోగ ఓటర్లు బ్యాలెట్ పత్రాలపై ఓటు నమోదు చేశారు. నియోజకవర్గంలో 788 ఓట్లకు గాను 615 ఓట్లు పోలైనట్లు చెప్పారు. జిల్లాలోని ఓట్లలో గుడివాడ 282, పామర్రు 45, పెడన 34, అవనిగడ్డ 36, మచిలీపట్నం 36, గన్నవరం 19, పెనమలూరు 41 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.

సజావుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఉంగుటూరు :నారాయణపురం ఫెసిలిటేషన్ సెంటర్‌లో రెండో రోజు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా సాగింది. మొదటి రోజు బ్యాలెట్ ఓటింగ్‌లో వచ్చిన సమస్యలను పునారావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో 1436 బ్యాలెట్ ఓట్లకు శనివారం 745 పోల్ అవ్వగా ఆదివారం మిగతా వారు వినియోగించుకున్నారు. యుటిఎఫ్ తదితర ఉపాధ్యాయులతో పాటు ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ రంగాల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.